## క్లుప్తంగా

### జీయన్న ఆలయం తనిఖీ



జీయన్న ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన జీయన్నస్వామి ఆలయాన్ని పురావస్తుశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయం వెనకుభాగంలో ప్రహరీ కూలిపోయే ప్రమాదం ఉందని మఠం సభ్యుడు పొడుగు రవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు ఆలయ పరిసర ప్రాంతాలను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు, పలువురు అధికారులు పరిశీలించారు. ప్రహరీ, నల్ల చెరువు గట్టుకు కొలతలు వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పి.వీరశిరీష, వీఆర్వో సుబ్బారావు, ఇరిగేషన్ ఏఈ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

### కంటి వైద్య శిబిరం



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

తుని: స్థానిక అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వాకర్స్ హెల్త్‌క్లబ్, హైమ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ ప్రారంభించారు. వృద్ధులకు మెరుగైన కంటిచూపు అందించాలన్న లక్ష్యంతోనే ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. డాక్టర్లు 50 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వీరిలో 11 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్టు గుర్తించి ఆపరేషన్ నిమిత్తం పాయకరావుపేట హైమ నేత్రాలయానికి తరలించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు డీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు కండవల్లి జోసెఫ్, మేములూరి ప్రసాద్, హైమ నేత్రాలయ సిబ్బంది కొమ్మన రవి, వృద్ధాశ్రమం ప్రతినిధి మల్లీశ్వరి పాల్గొన్నారు.

### చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

గండేపల్లి: తల్లితండ్రులు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ నరేష్ సూచించారు. ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అప్పుడే పుట్టిన శిశువులు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ అందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మొదటి రోజు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లు వద్ద చుక్కల మందు వేస్తారన్నారు. మిగిలిన పిల్లలకు 4, 5 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు మందు వేస్తారని తెలిపారు.

**పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి**

తొండంగి: మండలవ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ కోరారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద వైద్యారోగ్య సిబ్బంది ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేస్తారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

### ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి



ఏలేశ్వరంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అనంతారపు రాజు, కాకాడ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. స్థానిక పెద్దవీధి ఎస్సీపేటలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గండేటి కిషోర్, మోర్త తాతారావు, కాకాడ చక్రవర్తి, సిరికోటి వీరబాబు, వేమగిరి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

### మహిళపై ఇటుకతో దాడి

కిర్లంపూడి: మహిళపై ఇటుకతో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై షేక్ జబీర్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గెద్దనాపల్లిలో ఇరుగుపొరుగున నివసిస్తున్న పంతం మేరీ ఇంటి నుంచి పంతం కేశవరావు ఇంటి వైపు నీరు వస్తోందంటూ ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవలో కేశవరావు ఇటుకతో మేరీపై దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై జబీర్ తెలిపారు.

# సంక్షేమ సారథి మళ్లీ గెలవాలంటూ పాదయాత్ర

- ఎస్.అన్నవరం నుంచి రత్నగిరికి కాలినడకన చేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- అడుగడుగునా ఘనస్వాగతం పలికిన నాయకులు



ఎస్.అన్నవరంలో జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు



తొలి పావంచా మీదుగా మెట్లమార్గంలో అన్నవరం దేవస్థానానికి చేరుకున్న పార్టీ శ్రేణులు

తుని రూరల్: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ మండలంలోని ఎస్.అన్నవరం గ్రామం నుంచి శంఖవరం మండలంలోని అన్నవరం దేవస్థానానికి శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేశారు. ప్రజానేత జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపొందాలని, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా వరుసగా మూడోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని కోరుకుంటూ 150 మంది పార్టీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ఎస్.అన్నవరంలోని రామాలయం సెంటర్‌లో డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, దాడిశెట్టి బాబూరావు, వంగలపూడి గంగా, ముత్తా శివాజీ ఆధ్వర్యంలో పాదయాత్ర సాగింది. సుమారు 23 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి మెట్ల మార్గంలో అన్నవరం దేవస్థానానికి చేరుకున్నారు. వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

**అపూర్వ స్వాగతం**

పాదయాత్రకు చేపూరు, ఎర్రకోనేరు, రాజులకొత్తూరు గ్రామాల్లో అపూర్వ స్వాగతం లభించింది. ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. తేటగుంటలో ఆత్మ కమిటీ చైర్మన్ చోద్రాజు రాంబాబు రాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, గణేసుల వీరబాబు, సాదరంగా ఆహ్వానించి, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**స్వచ్ఛందంగా పాదయాత్ర**

పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, సేవాభావంతో పని చేస్తున్న దాడిశెట్టి రాజా 2024 ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ అన్నవరం దేవస్థానానికి స్వచ్ఛందంగా పాదయాత్ర చేయడం అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ అన్నారు. ప్రజల్లో ఉన్న అభిమానం ఇలా పాదయాత్రగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, నాయకులు కుసనం దొరబాబు, కీర్తి రాఘవ, వంగలపూడి వాసు, వంగలపూడి గోవిందుబాబు, ములగపాటి లోవరాజు వర్మ, కీర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

### పవర్ లిఫ్టింగ్‌లో మణికంఠకు గోల్డ్ మెడల్



మణికంఠను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థి డి.వేణు మణికంఠ 105 కేజీల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించినట్టు కళాశాల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి శుక్రవారం తెలిపారు. బీబీఏ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వేణు మణికంఠ ఆదికవి కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ కొలిజియేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2023–24లో ప్రతిభ చూపి బంగారు పతకం పొందాడన్నారు. మణికంఠ గతంలో 15 బంగారు, 5 వెండి, 5 కాంస్య పతకాలు సాధించినట్టు వివరించారు. ఈ సందర్భంగా మణికంఠను ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయభార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ధర్మరాజు తదితరులు అభినందించారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గొల్లలగుంటలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

జగ్గంపేట: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో శుక్రవారం పార్టీ నేత రామకృష్ణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన మేలును ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్య లేకుండా చేశానని తెలిపారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో పేదలకు మంజూరైన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, గఫూర్, తులా రాము, రావుల గణేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

### అల్లూరి సేవా కమిటీ కార్యాలయం ప్రారంభం



కోటనందూరులో అల్లూరి సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీరభద్రరావు

కోటనందూరు: గ్రామంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు సేవాకమిటీ నూతన కార్యాలయాన్ని ఆ సంఘ జాతీయ యువజన సంఘ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు శుక్రవారం ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు నడయాడిన కోటనందూరు పరిసర ప్రాంతాల్లో కమిటీ సేవలు మరింత విస్తృత పరిచే లక్ష్యంతోనే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వీరభద్రరావు తెలిపారు. సేవా కార్యక్రమాలపై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేసారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడు పి.దేవుళ్లు, శివాలయం చైర్మన్ వత్సవాయి నారాయణరాజు, ఆర్.నారాయణమూర్తి సోదరుడు రెడ్డి బుల్లబ్బాయి, సినీ నటుడు మహర్షి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- యర్రవరంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని యర్రవరంలో శుక్రవారం రెండోవిడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యుడు పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నేతలు రామిశెట్టి వెంకటరమణ, బుద్దా గణేష్, గుల్లంపూడి గంగాధర్, దాసరి రమేష్, నీరుకొండ అర్జునరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక



వీరవరంలో పార్టీలో చేరిన వారితో తోట నరసింహం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లికి చెందిన 100 మంది జనసేన పార్టీని వీడి శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కాట్రావులపల్లి నుంచి పైలా చైతన్య, కొట్టేటి గంగబాబు, బిందానపు పేర్రాజు ఆధ్వర్యంలో వీరంతా ర్యాలీగా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చేరుకున్నారు. అక్కడ వీరికి తోట నరసింహం, తోట రాంజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తోట నరసింహం సూచించారు.

### జేసీఎస్ మండల ఇన్‌చార్జిగా దొరబాబు



దొరబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ జగనన్న సచివాలయ కన్వీనర్ల (జేసీఎస్) మండల ఇన్‌చార్జిగా మండలంలోని ఉత్తరకంచి గ్రామానికి చెందిన గొల్లపల్లి దొరబాబు నియమితులయ్యారు. జేసీఎస్ ఇన్‌చార్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దొరబాబును ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు తదితరులు పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనను జేసీఎస్ మండల ఇన్‌చార్జిగా నియమించిన ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావుకు దొరబాబు కృతజ్ఞతలు తెలిపారు.

### అనుబంధ సంఘాలకు నూతన కార్యవర్గాల ఎన్నిక



అనుబంధ సంఘాల ప్రతినిధులను సత్కరిస్తున్న పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ అనుబంధ సంఘాలకు పట్టణంలో శుక్రవారం నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటీ ఆధ్వర్యంలో మాతృశక్తి, దుర్గావాహిని సంఘాలకు కార్యవర్గాలను ఎన్నుకున్నారు. మాతృశక్తి అధ్యక్షురాలిగా చిట్టంశెట్టి మల్లీశ్వరి, కార్యదర్శిగా వాగు కల్యాణి, ఉపాధ్యక్షులుగా జి.గిరిజ, కె.రమాదేవి, సహాయ కార్యదర్శులుగా కె.మహాలక్ష్మి, మంగామణి, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా కె.ఇందిరా, గౌరవాధ్యక్షురాలిగా వి.సూర్యకుమారిలను ఎన్నుకున్నారు. అలాగే దుర్గావాహిని సంఘం అధ్యక్షురాలిగా మండ సూర్యకుమారి, ప్రధాన కార్యదర్శిగా నేతి కామాక్షి, కోశాధికారిగా స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా సాల్లేటి లక్ష్మి, ఆర్.వరలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా సాల్లేటి మాధవి, సాల్లేటి జ్యోతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పాబోలు దేవి, గౌరవాధ్యక్షురాలిగా గొల్లపూడి మహలక్ష్మీలను ఎన్నుకున్నారు. వీరిని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు సత్కరించారు. పరిషత్ సభ్యులు తూముర్రోతు గురయ్య, గొల్లపూడి సత్యనారాయణ, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

### రంచన్‌గా పింఛన్



ఏలేశ్వరంలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వల్లీరాణి

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో భాగంగా సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెలవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. తొలిరోజు మండల వ్యాప్తంగా 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నియోజవర్గంలో 38,888 మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. ఇంటికే రంచన్‌గా పింఛన్ అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



జగ్గంపేటలో బాలిక తల్లికి చెక్కు అందజేస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన బొడ్డు తాన్విక అనే 14 నెలల బాలిక పుట్టినప్పటి నుంచి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. ఆమె వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.90 వేలు మంజూరైంది. ఈ చెక్కును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం జగ్గంపేట ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం బాధిత చిన్నారి తల్లి దేవికి అందజేశారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, నీలాద్రిరావుపేట సర్పంచ్ ముల్లంపాక సురేష్, వైఎస్సార్ సీపీ నేతలు మద్దిపట్ల రామకృష్ణ, రావుల గణేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

### బెల్లపు ఊట ధ్వంసం

తుని: సారా తయారీకి సిద్ధం చేసిన 6,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్ఈబీ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్ఓ పి.చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...జిల్లా ఎస్పీ, సెబ్ అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ, అనకాపల్లి ఎస్ఈబీ టీంలు పాయకరావుపేట ఎస్ఈబీ స్టేషన్, తొండంగి పోలీసు సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో తొండంగి మండలం వేమవరంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 6,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, విశ్రాంత డిప్యూటీ ఈఓ ఈరంకి జగన్నాథరావు, ఆలయ సూపరింటిండెంట్ ఐవీ రామారావుతో పాటు 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

**అమ్మవార్లకు లక్షకుంకుమార్చన**

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండదిగువ కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు



తుని రాజా కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. పరీక్షలకు 713 మంది విద్యార్థులకు గాను 29 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. కాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 368 విద్యార్థులకు గాను 351 మంది, గురుకుల కళాశాలలో 345 మంది విద్యార్థులకు గాను 333 మంది పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరయ్యారు.

**114 మంది గైర్హాజరు**

తుని: పట్టణంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను హాల్‌టికెట్ల పరిశీలన అనంతరం అధికారులు పరీక్షా హాలుకు అనుమతించారు. తుని పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 2690 మంది విద్యార్థులకు గాను 2,576 మంది పరీక్షలకు హాజరైనట్టు కస్టోడియన్ ప్రభాకరరావు తెలిపారు. 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయలేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**16 మంది గైర్హాజరు**

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ములగపూడి మహిళా జూనియర్ కళాశాల, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, రౌతులపూడి విజేత, తిరుమల జూనియర్ కళాశాలల నుంచి మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 242 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 226 మంది హాజరయ్యారు. 16 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య సేవలు, తాగునీరు అందుబాటులో ఉంచారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**19 మంది గైర్హాజరు**

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు పరీక్షలకు 613 మందికి గాను 594 మంది హాజరుకాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ కల్యాణ్‌కుమార్ తెలిపారు.



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

శంఖవరం: మండలంలోని ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఆదర్శ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు గాను 291 మంది హాజరు కాగా, సీతారామా కళాశాలలో 218 మంది గాను 207 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. చీఫ్ సూపరింటిండెంట్ కిశోర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



జగ్గంపేటలో లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బింధుమాధవి

జగ్గంపేట: గ్రామంలో ప్రధాన మంత్రి ఉజ్వల పథకం లబ్ధిదారులకు శుక్రవారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని 82 మంది లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా ఎవరైనా పేదలకు గ్యాస్ కనెక్షన్ లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆకుల శ్రీధర్, గొల్లపల్లి శ్రీను, చెరుకూరి జయరాజ్, వైఎస్సార్ సీపీ నేత కిలపర్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అడవిరాజులబాబు పండగ



బిళ్లనందూరులో కొండరాజులబాబు ఆలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి, బిళ్లనందూరు, జగన్నాథపురం, కేఏ మల్లవరం, టీజే నగరం గ్రామాల్లో అడవి రాజులబాబు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు డప్పువాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామ పొలిమేర్లలో ఉన్న ఆలయాలకు ర్యాలీగా తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. బంధు, మిత్ర పరివారంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.